క్లుప్తంగా

నకిలీ విత్తనాలతో మోసపోవద్దు

చండ్రుగొండ: నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని వ్యవసాయశాఖ అశ్వరావుపేట సహాయ సంచాలకులు అఫ్జల్‌బేగం రైతులకు సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. గుర్తింపు పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని, పంటకాలం పూర్తి అయ్యేవరకు బిల్లులు భద్రపరుచుకోవాలని రైతులకు తెలిపారు. గ్రామాల వారిగా ప్రతిరైతులకూ నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించాలని అధికారులకు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ వినయ్, ఏఈఓలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై సమీక్ష

అశ్వారావుపేటరూరల్: వర్షాకాలం సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై క్షేత్ర స్థాయి వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సబ్ యూనిట్ అధికారి అజ్మీర వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని వినాయకపురం పీహెచ్‌సీలో సబ్ యూనిట్ పరిధిలోని వినాయకపురం, గుమ్మడవల్లి, దమ్మపేట మండలం దమ్మపేట, పట్వారీగూడెం పీహెచ్‌సీల క్షేత్ర స్థాయి సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మలేరియా ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభావిత గ్రామాల్లోని ప్రజలకు జూన్‌లో దోమ తెరలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అన్ని సబ్ సెంటర్లలో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేయాలని సూచించారు. సిబ్బంది హెచ్‌వీ దుర్గమ్మ, శ్రీనివాస్, రాజు, బషీరుద్దీన్, రాజు, సత్యనారాయణ, భాస్కర్, రవి, ప్రసాద్, గోపాల్, సతీష్ పాల్గొన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి..

కరకగూడెం: సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని కరకగూడెం ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి కారం మధు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శనివారం మండల పరిధిలోని రేగళ్ల గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి గ్రామస్తులకు రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. శిబిరంలో హెల్త్ అసిస్టెంట్ కృష్ణ, ఏఎన్‌ఎం జ్యోతి ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యశిబిరం

చండ్రుగొండ: మండలంలోని మద్దుకూరు గ్రామశివారు మంగళిబోడు గుత్తికోయగూడెంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో వ్యాధినిరోధక టీకాలు వేశారు. గర్భిణులకు ఆరోగ్య సూత్రాలను వివరించారు. అవసరం ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు.

కూలి రూ.600 ఇవ్వాలి

భద్రాచలంఅర్బన్: ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని, అదే విధంగా ఉపాధి పని చేస్తున్న కూలీలకు కనీసం రోజుకు 600 రూపాయలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం భద్రాచలం పట్టణ శివారులో ఉపాధి పని చేస్తున్న పని ప్రదేశాన్ని ఆయన సందర్శించి ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండుటెండలో పనిచేసినా రోజు కూలీ కింద 90 రూపాయలు ఇవ్వడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆర్థిక సాయం

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని మైన్స్ ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్(ఎంవీటీసీ)లో ఫిట్ సేఫ్టీ శిక్షణ పొందుతున్న సింగరేణి ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు కాలికి గాయమై ఆర్థిక ఇబ్బందులు పడుతున్న పారిశుద్ధ్య కాంట్రాక్ట్ కార్మికురాలు చల్లా వెంకట నరసమ్మకు శనివారం రూ.3200లను ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంవీటీసీ మేనేజర్ జి.నాగేశ్వరరావు సహాయం అందించిన ఉద్యోగులను, నాయకులను అభినందించారు. ఎంవీటీసీ అడిషనల్ మేనేజర్ గుగులోత్ లక్ష్మణ్, సర్వర్ నబి, ఉద్యోగులు పాల్గొన్నారు.

రుణాలు చెల్లించాలి

ములకలపల్లి: బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తే 3 శాతం వడ్డీ రాయితీ లభిస్తుందని ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ ఎం.సత్యనారాయణ తెలిపారు. ములకలపల్లి బ్రాంచ్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన మెగా క్రాస్ లోన్ మేళాలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. రైతులు బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఫీల్డ్ మేనేజర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విచారణ జరిపించండి

భద్రాచలంఅర్బన్: నర్సింగ్ విద్యార్థిని పగిడిపల్లి కారుణ్య అనుమానాస్పద మృతిపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ముసలి సతీష్, ఎమ్మార్పీఎస్ నాయకులు అలవాల రాజాదు శనివారం వేరువేరుగా ప్రకటనల్లో డిమాండ్ చేశారు. కళాశాల యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకుని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వారు చూడాలని కోరారు.

నాటు.. నాటు నాటు



- నాటు కోళ్లను కొనేందుకు మాంసం ప్రియుల ఆసక్తి
- గ్రామాల్లో పెరుగుతున్న కోళ్ల పెంపకం
- స్థానికుల ఉపాధికి ఊతం

బూర్గంపాడు: రోజురోజుకూ నాటు కోళ్లకు డిమాండ్ పెరుగుతోంది. ప్రస్తుతం మాంసం ప్రియుల మొదటి ప్రాధాన్యత నాటు కోళ్లకే దక్కుతుంది. ప్రస్తుతం బాయిలర్, ఫారం కోళ్ల అమ్మకాలు ఎక్కువగానే ఉన్నా రానురాను నాటు కోళ్లకు గిరాకీ పెరుగుతు వస్తుంది. గత 25 ఏళ్లుగా బాయిలర్ కోళ్లనే మాంసం ప్రియులు ఎక్కువగా తినేవారు. మేకలు, గొర్రెల మటన్ ధరలు ఎక్కువగా ఉండటంతో బాయిలర్ చికెన్‌పైనే మాంసం ప్రియులు ఆసక్తి కనబరిచేవారు. అయితే బాయిలర్ చికెన్ తినటం వలన రోగాలు పెరుగుతున్నాయనే ప్రచారం జరుగుతుంది. బాయిలర్ కోళ్లు తొందరగా ఎదిగేందుకు కొన్ని రకాల ఇంజక్షన్లు చేస్తున్నారనే ప్రచారముంది. దీనికి తోడు బాయిలర్ చికెన్ రుచి తగ్గటం, పోషకాలు సరిగా ఉండకపోవటంతో చాలామంది నాటు కోళ్లు తినేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

పెరిగిన ఆదరణ..

నాటు కోడి పులుసు, ఫ్రై, కర్రి రుచిగా ఉండటం, పోషకాలుండటంతో డిమాండ్ పెరిగింది. నాటు కోళ్లకు డిమాండ్ ఉండటంతో ప్రత్యేకంగా నాటు కోళ్ల మాంసం అమ్మేందుకు దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. నాటు కోళ్ల మాంసం కొనుగోళ్లకు మాంసం ప్రియులు ఎగబడుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో నాటు కోడి ధర కిలో రూ.400 నుంచి రూ.500 వరకు పలుకుతుంది. అదే సమయంలో పందెం పుంజుల మాంసం ధరలు కిలో రూ.800 నుంచి రూ.1000 వరకు పలుకుతుంది. మార్కెట్‌లో నాటు కోడి మాంసానికి ఫుల్ డిమాండ్ ఉండటంతో వాటిని పెంచేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నారు.

తెరపైకి పూర్వ వైభవం..

పూర్వం గ్రామాలలో ప్రతి ఇంట్లో నాటు కోళ్లు ఉండేవి. ఇంటి పెరళ్లలో, ఆవరణలలో పశువుల మేతలో మిగిలిన ధాన్యం గింజలు,పురుగులు తిని నాటు కోళ్లు పెరిగేవి. పండగలకు, పబ్బాలకు,చుట్టాలు వచ్చినప్పుడు ఇంట్లో పెంచుకున్న నాటు కోళ్లనే కోసుకుని తినేవారు. కాలక్రమంలో బాయిలర్ కోళ్లు వచ్చిన తరువాత నాటు కోళ్ల పెంపకం తగ్గుతు వచ్చింది.గ్రామీణ ప్రాంతాలలో కూడా బాయిలర్ చికెన్ షాపులు విపరీతంగా పెరిగాయి.గతంలో ఆదివారమే మాంసాహారం తినేందుకు ఆసక్తి చూపిన జనాలు ప్రస్తుతం వారాలతో పట్టింపు లేకుండా నిత్యం మాంసం తినేందుకు ఇష్టపడుతున్నారు. బాయిలర్ కోళ్లు తొందరగా పెరిగేందుకు కోళ్ల ఫారాల నిర్వహకులు కొన్ని రకాల ఇంజక్షన్లు ఇస్తున్నారు. వీటివలన కొన్ని దుష్ప్రభావాలు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. దీంతో మాంసం ప్రియులు బాయిలర్ చికెన్‌ను తినటం తగ్గిస్తున్నారు. ఈ తరుణంలోనే నాటు కోళ్లకు డిమాండ్ పెరుగుతుంది. రేటు ఎక్కువగా ఉన్న నాటు కోడిమాంసం తినేందుకు మాంసం ప్రియులు ఇష్టపడుతున్నారు. వైద్యులు కూడా బాయిలర్, ఫారం కోళ్ల చికెన్ కంటె నాటు కోడి మాంసం మంచిదని సూచిస్తున్నారు.



యువతకు ఉపాధి..

నాటు కోళ్ల మాంసానికి డిమాండ్ ఉండటంతో వాటిని పెంచేందుకు గ్రామీణులు ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా గ్రామాలలో చదువుకున్న నిరుద్యోగ యువత నాటు కోళ్ల పెంపకంపై మక్కువ చూపుతున్నారు. తక్కువ పెట్టుబడితో చాలామంది యువకులు కోళ్లను ఇంటి ఆవరణలోనే పెంచుతున్నారు మరికొందరు నాటు కోళ్ల పెంపకం కోసం షెడ్లు వేసి చిన్నపాటి ఫారాలను నిర్వహిస్తున్నారు.పనిలో పనిగా నాటు కోళ్లతో పాటుగా పందెం కోళ్లను పెంచి లాభాలను ఆర్జిస్తున్నారు. కొందరు యువకులు పట్టణ ప్రాంతాలలోని హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలకు రోజు నాటు కోళ్లను విక్రయిస్తు ఉపాధి పొందుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలో గ్రామదేవతల మొక్కులు తీర్చుకునేందుకు కూడా నాటు కోళ్లనే వినియోగిస్తుండటంతో వాటికి మంచి డిమాండ్ ఏర్పడింది. చుట్టాలు, ఫ్రెండ్స్ వచ్చినప్పుడు నాటు కోడి కూర ఫస్ట్ ఆప్షన్‌గా మారింది. రానున్న రోజులలో నాటు కోళ్లకు మరింత గిరాకి పెరిగే అవకాశాలున్నాయని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.



నాటు కోడికే ప్రాధాన్యత



ఇప్పుడు నాటు కోడి మాంసం మాకు ఫస్ట్ ఆప్షన్‌గా మారింది. బాయిలర్ చికెన్ రుచిగా ఉండటంతో లేదు. బాయిలర్ కోళ్లు తొందరగా బరువు పెరిగేందుకు ఇంజక్షన్‌లు చేస్తున్నారు. దీంతో చాలామంది నాటు కోడి మాంసం తినేందుకు ఇష్టపడుతున్నారు. బాయిలర్ చికెన్‌కు రెట్టింపు ధర ఉన్న నాటు కోడి చికెన్‌కే ప్రాధాన్యతనిస్తున్నాం.

– వంగరాజు నర్సింహారావు, ఐటీసీ కార్మికుడు

ఆ రుచే వేరు..



నాటు కోడి రుచే వేరుగా ఉంటుంది. మటన్ ధరకు దగ్గరగా నాటు కోడి మాంసం ధర ఉంది. అయినా నాటు కోడి మాంసం తినేందుకు ఇష్టపడుతున్నాం. నాటు కోడి పులుసు రొట్టెలలో,అన్నంలో చాలా రుచిగా ఉంటుంది. బాయిలర్ కోళ్లకు రోగాలు పెరుగుతున్నాయి. అందుకే చాలామంది నాటు కోళ్లను తినేందుకు ఇష్టపడుతున్నారు.

– ఎండీ.సత్తార్, బూర్గంపాడు

తాత్కాలిక రోడ్డు పునరుద్ధరణ



వాగుపై నిర్మించిన డైవర్షన్ రోడ్డు..

ములకలపల్లి: ముత్యాలంపాడు శివారు వాగుపై తాత్కాలికంగా నిర్మించిన డైవర్షన్ రోడ్డును ఎట్టకేలకు పునరుద్ధరించారు. ఈ వాగుపై శాశ్వత వంతెన నిర్మాణ పనులు ఇటీవలే మొదలుపెట్టారు. ఇందులో భాగంగా లోలెవల్ చప్టాను తొలగించి, డైవర్షన్ రోడ్డును ఏర్పాటు చేశారు. ఐతే గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో ముత్యాలంపాడు, రాచన్నగూడెం జీపీల్లోని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ తరుణంలో అత్యవసర పరిస్థితుల్లో వాగునీళ్లను దాటుకుంటూ, బండరాళ్ల మధ్య కాలినడకన బైటికి వచ్చారు. ఈ ఉదంతంపై 'నడ(ర)క యాతన'శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం విదితమే. కాగా అధికారులు వాగుపై మరలా డైవర్షన్ నిర్మించారు. మట్టితోలి, తాత్కాలికంగా రోడ్డు వేశారు. రెండు రోజులు అవస్థలు పడ్డ ప్రజానీకానికి ఎట్టకేలకు శనివారం నుండి మరలా రాకపోకలు ఆరంభమయ్యాయి. వంతెన నిర్మాణంలో త్వరగా పూర్తయితే తమ బాధలు ఒడ్డెక్కుతాయని స్థానికులు పేర్కొంటున్నారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

దమ్మపేట: మండల కేంద్రంలోని కోపరేటివ్ సొసైటీ కార్యాలయంలో సొసైటీ చైర్మన్ ఎల్లిన రాఘవరావు శనివారం జీలుగులు, జనుముల పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. పచ్చిరొట్ట విత్తనాల అవసరం ఉన్న రైతులు కార్యాలయానికి వచ్చి తీసుకోవచ్చని తెలిపారు. రైతుల డిమాండ్ మేరకు మరికొంత స్టాక్ కూడా తీసుకొస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రావు గంగాధరరావు, చిన్నశెట్టి సత్యనారాయణ, చిన్నశెట్టి యుగంధర్, గూడపాటి వెంకట్రావు, చక్కిరాల మల్లేశ్వరరావు, ఎర్రగొర్ల రాధకృష్ణ, యర్రా వసంత రావు, ఎల్లిన మురళీ పాల్గొన్నారు.

జీలుగు విత్తనాలు సిద్ధం..

దుమ్ముగూడెం: రైతులకు సబ్సిడీపై అందించేందుకు జీలుగు విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి నవీన్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దుమ్ముగూడెం సొసైటీ నందు జీలుగు విత్తనాలు 3600 కేజీలు సిద్ధంగా ఉన్నాయని కేజీ రూ.93 లని సబ్సిడీ అమౌంట్ రూ.55.80 పోగా రైతుకు రూ.37.20లకు లభిస్తుందని కావాల్సిన రైతులు తమ పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డ్, జిరాక్స్‌లు సంబంధిత ఏఈఓకు అందచేసి కూపన్‌లు తీసుకుని సొసైటీ దగ్గర విత్తనాలు పొందాలని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



దమ్మపేటలో పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తున్న సొసైటీ డైరెక్టర్ ఎల్లిన రాఘవరావు

రేపటి నుంచి పంపిణీ..

బూర్గంపాడు: రైతులు మాగాణి భూముల్లో పచ్చిరొట్టగా సాగు చేసుకునేందుకు రాయితీపై జీలుగు విత్తనాలను సోమవారం నుంచి పంపిణీ చేయనున్నట్లు పీఏసీఎస్ సీఈఓ ప్రసాద్ తెలిపారు. శనివారం ఓ ప్రకటనలో రైతులు వ్యవసాయశాఖ అధికారుల వద్ద నుంచి కూపన్లు తీసుకువస్తే రాయితీపై జీలుగు విత్తనాలను అందిస్తామని తెలిపారు.

ఆధునిక సేవలపై దృష్టి



బ్రాంచ్ పోస్టాఫీస్ సిబ్బందికి థర్మల్ ప్రింటర్లను అందిస్తున్న రమేష్ నాయక్

అశ్వారావుపేటరూరల్: మారుతున్న ఆధునిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని, తపాలా శాఖలో కూడా ఆధునిక సేవలను అందిస్తున్నామని పాల్వంచ సబ్ డివిజనల్ పోస్టల్ ఇన్స్‌పెక్టర్ రమేష్ నాయక్ అన్నారు. శనివారం ఆయన అశ్వారావుపేట తపాలా కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం పాల్వంచ సబ్ డివిజన్ పరిధిలోగల 74 బ్రాంచ్ తపాలా కార్యాలయాలకు థర్మల్ ప్రింటర్ల పంపిణీను ప్రారంభించి, స్థానిక సిబ్బందికు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవిత బీమా, ఆర్డీ, సుకన్య సమృద్ధి యోజన పథకాలను అమలు చేస్తుండగా.. ఈ పథకాల అమలులో దేశంలో తపాలా శాఖ ప్రథమ స్థానంలో ఉందని అన్నారు. తపాలా శాఖ ద్వారా లబ్దిదారుల ఇంటి వద్దకే వెళ్లి సేవలు అందిస్తున్నామని చెప్పారు. రానున్న రోజుల్లో తపాలా శాఖలో మరిన్ని మార్పులు, ఆధునిక టెక్నాలజీ అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తపాలా శాఖ సిబ్బంది శేషు, శ్యాం మహేంద్ర, బీపీఎంలు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని శనివారం వైభవంగా జరిపించారు. స్వామి వారికి ఉదయం పంచామృత అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు కల్యాణాన్ని వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా జరిపించారు.స్వామి వారి కల్యాణంలో మేనేజర్ రమణ పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

రెగ్యులరైజ్ చేయాలి



విద్యుత్ శాఖ డీఈ జీవన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భద్రాచలంఅర్బన్: విద్యుత్ సంస్థలో పని చేస్తున్న ఆర్టిజన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి బొల్లి వెంకటరాజు అన్నారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని విద్యుత్ శాఖ డీఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని విద్యుత్ శాఖ డీఈ జీవన్ కుమార్‌కు యూనియన్ నాయకులు అందించారు. ఈ సందర్భంగా వెంకటరాజు మాట్లాడుతూ.. ఆర్టిజన్ కార్మికులు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నప్పటికీ వారిని రెగ్యులర్ ఉద్యోగులుగా ప్రభుత్వం యాజమాన్యం గుర్తించకపోవడం సరైనది కాదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహ జ్యోతి పథకాన్ని కొనసాగిస్తున్న నేపథ్యంలో స్పాట్ బిల్లర్లు, బిల్ కలెక్టర్లు తమ ఉపాధిని కోల్పోయారని వారందరికీ విద్యుత్ సంస్థలో ప్రత్యామ్నాయ ఉపాధిని కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ టీఎస్ యూఈఈయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు కూసురాజు శ్రీనివాస్, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్ పదిలం శ్రీనివాస్, సీతారాములు, బుడిగ రమేష్ ఉదయ్ రత్న కుమార్, శంకర్ వర్మ, కనుక సత్యనారాయణ, బి.జగన్ మోహన్ రెడ్డి, మధు, లీలావతి, రాజ్యలక్ష్మి, పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించండి

గుండాల: ఖమ్మం, నల్గొండ, వరంగల్ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సోలం సతీష్ అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో పట్ట భద్రులను కలిసి ప్రచారం నిర్వహించారు. కమలం గుర్తుపై ఓటేసి తమ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఇర్పా ప్రకాష్, వాగబోయిన హరిబాబు, నరేష్, అశోక్, రవీందర్, గొగ్గెల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ విస్తృత ప్రచారం

మణుగూరురూరల్: ప్రజాసమస్యలపై గళమెత్తే బీఆర్‌ఎస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డిని గెలిపించాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు శనివారం ఓ ప్రకటనలో పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హామీలపై మండలిలో గళమెత్తి ప్రశ్నించాలంటే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏనుగుల రాకేష్‌రెడ్డికి తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు.

అశ్వాపురం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ మండల పరిధిలోని సంద్రలబోడు, చింతిర్యాల, చింతిర్యాల కాలనీ ప్రాంతాల్లో శనివారం బీఆర్‌ఎస్ నాయకులు పట్టభద్రులను కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎన్నా అశోక్‌కుమార్, మాజీ సర్పంచ్ పాయం భద్రయ్య, కాకా అశోక్, తాటి నరేష్, శశికుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి ఆధ్వర్యంలో శనివారం బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మేడవరపు సుధీర్, రామగిరి భాస్కర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చర్లరూరల్: ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల బీఆర్‌యస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ..చర్ల పట్టణంలో బీఆర్‌యస్ శ్రేణులు శనివారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బిఆర్‌యస్ పార్టీ మండల అధ్యక్షులు సోయం రాజారావు, ప్రధాన కార్యదర్శి పోలిన లంకరాజు నాయకులు దొడ్డి తాతారావు,యస్డీ అజీజ్, చింతా నాగబాబు, ఇర్సవడ్ల రాము,కాకి అనిల్,సాయి, సృజన్, పంజారాజు తదితరులు పాల్గొన్నారు.



అన్నపురెడ్డిపల్లి: ప్రచారం చేస్తున్న బోయినపల్లి సుధాకర్, నాయకులు

అన్నపురెడ్డిపల్లి: ఎమ్మెల్సీ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాకేష్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్ కోరారు. శనివారం మండల కేంద్రంలో ఏనుగల రాకేష్‌రెడ్డి గెలుపును ఆకాంక్షిస్తూ ఆయన ప్రచారం చేశారు. రాకేష్‌రెడ్డి గెలుపుతోనే నిరుద్యోగుల సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చల్లా రాంబాబు, పుల్లారావు, నాగరాజు, పర్సా మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నకు మద్దతుగా నిలుద్దాం

దమ్మపేట: ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో, కాంగ్రెస్ పార్టీ మద్దతు తెలిపిన ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. శనివారం మండలంలోని మొద్దులగూడెం, నాయుడుపేట, ముష్టిబండ, అల్లిపల్లి, దమ్మపేట తదితర గ్రామాల్లో, ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపును కాంక్షిస్తూ.. ఎమ్మెల్యే జారే విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఓటర్ల వద్దకు నేరుగా వెళ్లి, మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటును వేయాలని అభ్యర్థించారు. మల్లన్నను గెలిపించాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలు, అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రావు గంగాధరరావు, అలపాటి ప్రసాద్, సొసైటీ చైర్మన్ ఎల్లిన రాఘవరావు, చిన్నశెట్టి యుగంధర్, ఎర్రగొర్ల రాధకృష్ణ, కక్కిరాల రమేష్, అత్తులూరి వెంకటరామారావు, కేవీ.సత్యనారాయణ, పగడాల రాంబాబు, గూడపాటి వెంకట్రావు, చెక్కిరాల మల్లేశ్వరరావు, రావు రవిశంకర్, సాయిల నర్సీ, ఈశ్వరప్రగడ భూషణ్, యర్రా వసంతరావు, ఎల్లిన మురళి పాల్గొన్నారు.

అశ్వాపురం: ఈ నెల 27న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మద్దతుగా నిలిచి గెలిపిద్దామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య అన్నారు. భిక్షమయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శనివారం కాంగ్రెస్, మిత్ర పక్షాల నాయకులు ఎన్నికల ప్రచారం చేపట్టి పట్టభద్రులను కలిసి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్‌బాబు, సదర్‌లాల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ నాయకులు మొగళ్లపు చెన్నకేశవరావు కోరారు. శనివారం అశ్వారావుపేటలోని పలు ప్రాంతాల్లో పర్యటించి, ఎమ్మెల్సీ అభ్యర్థిగా మల్లన్నను గెలిపించాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కె.పాషా, పార్టీ నాయకులు జ్యేష్ట సత్యనారాయణ, బాలయ్య, సత్యనారాయణ, షేక్ బాజీ, జల్లిపల్లి దేవరాజు పాల్గొన్నారు.



ప్రచారంలో ఓటర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు..

మణుగూరుటౌన్: కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. సమితిసింగారంలోని రాజీవ్‌గాంధీనగర్‌లో, గుట్టమల్లారంలో ప్రచారం నిర్వహించి ఓట్లు అభ్యర్థించారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మరోవైపు, మణుగూరు మండలం, పట్టణంలో అన్ని వార్డుల్లో పట్టభద్రుల ఇండ్లకు వెళ్లి తీన్మార్ మల్లన్న ను గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు ఓట్లను అభ్యర్థించారు. ఆయా ప్రాంతాల్లోని పలువురు పార్టీ నాయకులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండల వ్యాప్తంగా ఉన్న పట్టభద్రులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు తమ అభ్యర్థికే వేయాలని కాంగ్రెస్ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు కోయనర్సాపురం గ్రామంలో నిర్వహించిన ప్రచారంలో పాల్గొన్నారు. కాగా, బీఆర్ఎస్ ఆధ్వర్యంలోనూ ప్రచారం ముమ్మరంగా కొనసాగింది.



ముష్టిబండలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జారే, కాంగ్రెస్ నాయకులు



దుమ్ముగూడెం: కోయనర్సాపురంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

సమన్వయంతో పని చేయాలి..

దుమ్ముగూడెం: ఉమ్మడి నల్గొండ, వరంగల్,ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలిపించడం కోసం కాంగ్రెస్, సీపీఎం నాయకులు సమన్వయంతో పని చేయాలని ఇరు పార్టీల నాయకులు నిర్ణయించారు. శనివారం ములకపాడు సీపీఎం కార్యాలయంలో ఇరు పార్టీలకు చెందిన నాయకులు సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరమాచనేని వినీల్, సీపీఎం మండల కార్యదర్శి కారం పుల్లయ్య, సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ, కాంగ్రెస్ నాయకులు శిరపు అప్పల రెడ్డి, నటరాజ స్వామి,మాజీ సర్పంచులు వర్ష చిన్నారావు, మడకం చంద్రశేఖర్, సిపిఎం పార్టీ నాయకులు గుడ్ల రామ్మోహన్ రెడ్డి, తీన్మార్ మల్లన్న టీం సభ్యులు సిద్ది ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.